# ఆర్ఎఫ్‌సీఎల్‌లో ప్రమాదం

- మెకానిక్ కార్మికుడికి అస్వస్థత
- దవాఖానలో కోలుకుంటున్న బాధితుడు


చికిత్స పొందుతున్న బాధితుడు

ఫర్టిలైజర్‌సిటీ, జూన్ 15 : రామగుండం ఎరువుల కర్మాగారంలో శనివారం రాత్రి బీ షిఫ్ట్‌లో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మెకానిక్ విభాగానికి చెందిన ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీవాసి ఎండీ అఫ్జల్ అనే కాంట్రాక్టు కార్మికుడు అస్వస్థతకు గురయ్యాడు. అతడిని స్థానిక ప్రైవేటు దవాఖానకు తరలించగా, ప్రస్తుతం కోలుకుంటున్నాడు. ప్రమాద ఘటన వివరాలిలా ఉన్నాయి. శనివారం రాత్రి బీ షిఫ్ట్‌లో అఫ్జల్‌తో పాటు సునీల్, వంశీ, శ్రావణ్, శివ కంప్రెషర్ విభాగంలో విధులు నిర్వహిస్తుండగా, కంప్రెషర్‌కు ఇన్సులేషన్ బిగిస్తున్న క్రమంలో వేడిగా ఉన్న కంప్రెషర్‌పై ఆయిల్ పడడంతో మంటలు అంటుకున్నాయి. దీనికి తోడు అమ్మోనియా సైతం స్వల్పంగా లీకేజీ అయింది. దీంతో వాళ్లు వెంటనే స్పందించి కంప్రెషర్ హౌస్‌కు మంటలు అంటుకోకుండా నిలిపివేయగా వేడి మంటలు, అమ్మోనియా లీకేజీ కారణంగా అఫ్జల్ అస్వస్థతకు గురయ్యాడు. 40 రోజుల పాటు ప్లాంటు షట్‌డౌన్ తర్వాత యూనిట్ లైటప్ సమయంలో ఈ ఘటన జరిగిందని బాధిత కార్మికుడు పేర్కొన్నాడు. తాను అప్రమత్తంగా లేకపోతే భారీ నష్టం జరిగేదన్నారు. దవాఖానలో కోలుకుంటున్న అఫ్జల్‌ను ఆర్ఎఫ్‌సీఎల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు అంబటి నరేశ్ పరామర్శించారు. కాగా, దవాఖానలో ప్రమాద ఘటన వివరాలను ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్ బాధితుడి నుంచి సేకరించారు.

**మెకానికల్ విభాగానికి అందని వేతనాలు?**

ఆర్ఎఫ్‌సీఎల్ మెకానికల్ విభాగంలో పనిచేస్తున్న 120 మంది కాంట్రాక్ట్ కార్మికులకు 45 రోజులు గడిచిరా వేతనాలు చెల్లించలేదు. కాగా, ఈ విభాగంలో కాంట్రాక్ట్ సంస్థ ఆదివారం నుంచి మరో కంపెనీ బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలిసింది. దీంతో తమ వేతనాలు ఎవరిస్తారని కార్మికులు ప్రశ్నిస్తున్నారు

# ఆర్ఎఫ్‌సీఎల్‌లో యూరియా ఉత్పత్తి ప్రారంభం

- వార్షిక మరమ్మతులు పూర్తి

ఫర్టిలైజర్‌సిటీ, జూన్ 15: రామగుండం ఎరువుల కర్మాగారంలో నెల రోజుల తర్వాత ఆదివారం యూరియా ఉత్పత్తి ప్రారంభమైంది. వార్షిక మరమ్మతు పనుల్లో భాగంగా ఇటీవలే షట్‌డౌన్ చేశారు. అయితే యూరియా ఉత్పత్తిలో కీలకమైన క్యాటలీస్ రాక ఆలస్యంతో ఎనిమిది రోజులపాటు లేటుగా ఉత్పత్తి మొదలైంది. కాగా, రోజుకు 2,200 మెట్రిక్ టన్నుల అమ్మోనియా, 3,850 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తితో ఏడాదికి 12.7 లక్షల మెట్రిక్ టన్నులే లక్ష్యంగా ప్లాంట్‌ను నెలకొల్పగా, 2022 నవంబర్‌లో ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ క్రమంలో 2022–23లో 8.40లక్షల మెట్రిక్ టన్నులు, 2023–24లో 11.95లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరిగింది. తెలంగాణకు యూరియా అందించడంలో ఆర్ఎఫ్‌సీఎల్ తనదైన శైలిలో కృషిచేస్తున్నది. ఉత్పత్తిలో ప్రతి ఏడాది 40శాతం అంటే సుమారు 3.50లక్షల మెట్రిక్ టన్నులు మన రాష్ర్టానికే సరఫరా చేస్తున్నది. అలాగే తమిళనాడు, ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ రాష్ర్టాలకు ఏడాదికి ఉత్పత్తిలో 10శాతం చొప్పున సరఫరా చేస్తున్నారు. ఎట్టకేలకు రామగుండం ప్లాంటులో ఉత్పత్తి ప్రారంభంతో తెలంగాణకు ఈ వానకాలం సీజన్‌లో పూర్తిస్థాయిలో యూరియా అందుబాటులోకి రానున్నది.

# అధికారుల సంఘం ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 15 : సింగరేణి అధికారుల సంఘం ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం ఆదివారం ఆర్జీ–2 ఏరియాలోని ఎన్‌సీవోఏ క్లబ్‌లో జరిగింది. ఆర్జీ–2 ఏరియా సంఘ అధ్యక్షుడు ఎస్‌ఓటుజీఎం ఎం. రాముడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల అధికారుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. ఇందులో అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా పీఆర్‌పీ (పర్మామెన్స్ రిలేటెడ్ పే) తోపాటు అధికారుల సంక్షేమం, మౌలిక వసతుల అమలు కోసం దశల వారీగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా త్వరలోనే సంస్థ సీఅండ్ఎండీ ఇతర డైరెక్టర్లను కలిసి విన్నవించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నర్సింహులు, ఉపాధ్యక్షుడు టీ శ్రీనివాస్, రాజీవ్ కుమార్, సీహెచ్ రాజగోపాల్ పాల్గొన్నారు.

# బడిబాటపై ఉపాధ్యాయుల అనాసక్తి

- ఇలా వచ్చి... అలా వెళ్తున్న టీచర్లు
- సర్కారు స్కూళ్లలో విద్యార్థుల పెంపు అసాధ్యమే...?
- మూడు రోజుల్లో ముగింపు..
- రెండు వేలు దాటని అడ్మిషన్లు..



బడిబాటలో ప్రచారం చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు

పెద్దపల్లి కమాన్, జూన్ 15 : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఈ నెల 6న ప్రారంభమైన బడి బాట కార్యక్రమంపై ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆసక్తి చూపడం లేదనే విమర్శలొస్తున్నాయి. బడిబాట ప్రారంభమై పది రోజులు గడిచినా కొత్తగా రెండు వేల అడ్మిషన్లు కూడా చేయలేకపోవడమే ఇందుకు నిదర్శనం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ విద్య బలోపేతం కాగా, ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరిన తర్వాత నిర్లక్ష్యానికి గురవుతున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ హయాంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 40,638 మంది విద్యార్థులుండగా, కాంగ్రెస్ పాలనలో గత విద్యా సంవత్సరం (2024–25)లో 31,066 మందికి ఎన్‌రోల్‌మెంట్ పడిపోడిపోవడం గమనార్హం.. ఒకవైపు కలెక్టర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి నిరంతం పర్యవేక్షిస్తున్నా.. ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మాత్రం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారనే ఆరోపణలున్నాయి. బడిబాట మొదటి రోజు తప్ప మిగతా రోజుల్లో ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు ఎక్కడా ప్రచారం చేసిన దాఖలాలు లేవు.. బడిబాటలో భాగంగా ఇంటికి వెళ్లి బడీడు పిల్లలను గుర్తించాలి.. పాఠశాలల్లో కల్పించే వసతులు, అందించే విద్యపై కరపత్రాలు పంచుతూ ప్రచారం చేయాలి. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారులను స్కూల్‌లో చేర్పించాలి. కానీ ఉపాధ్యాయులు ఏదో నామమాత్రంగా తిరుగుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇక ప్రధానోపాధ్యాయులైతే మొదటి రోజు నిర్వహించిన సభలో తప్ప మిగతా రోజుల్లో ఎక్కడా ప్రచారం చేసిన దాఖలాలు లేవని విద్యార్థి సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.బడిబాట ముగింపునకు మరో మూడు రోజులే సమయమున్నందున గత ఏడాదితో పోల్చితే ఈ విద్యా సంవత్సరం ప్ర భుత్వ బడుల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరుగుతుందో లేదో వేచిచూడాలి..

**ప్రచారం తక్కువ.. ఫొటోలు ఎక్కువ**

బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంతంత మాత్రంగానే ప్రచారం చేస్తూ.. ఫొటోలు దిగుతూ సోషల్ మీడియాలో పోస్టులు మాత్రం ఎక్కువగా చేసుకుంటున్నట్లు తెలుస్తోం ది. గ్రామాల్లో ఇంటింటికీ కాకుండా తిరగకుండా వారికి తెలిసిన వాళ్ల ఇంటి కో, ఫ్రెండ్స్ దగ్గరికి వెళ్లి కబుర్లతో సరిపెట్టుకుంటున్నారనే ఆరోపణలొస్తున్నా యి. ఇక కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలు ప్రైవేట్ స్కూళ్లలో సాధించిన మార్కులు, మెమెంటోలు, అభినందన కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేయడం విమర్శలకు తావిస్తున్నది. స్కూల్ సమయానికి వచ్చామా.. ఆ తర్వాత ఎప్పుడు బయట పడదామా అనే విధంగా ఉపాధ్యాయులు వ్యవహరిస్తున్న తీరుతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎలా పెరుగుతుందని విద్యావంతులు, విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు..

**నర్సరీ విద్య లేకపోవడంతోనే..**

ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్య (నర్సరీ) లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య పెంచడం లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తల్లిదండ్రులు పిల్లలను నర్సరీలో ప్రైవేట్‌లో చేర్పించడంతో మిగతా తరగతులు కూడా అం దులోనే చదివిస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలోని 32 పాఠశాలల్లో నర్సరీ విద్య అం దించేందుకు రాష్ట్ర విద్యాశాఖ నుంచి అనుమతి వచ్చింది. మిగతా కొన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయు లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సొంతంగా వలంటీర్లను ఏర్పాటు చేసి నర్సరీ ప్రారంభిస్తున్నారు.

– డీ మాధవి, డీఈవో

# లోక్ అదాలత్‌లో 13,048 కేసులు పరిష్కారం

ఫర్టిలైజర్‌సిటీ, జూన్ 15: రామగుండం కమిషనరేట్ పరిధిలో శనివారం జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో మొత్తం 13,048 కేసులు పరిష్కారమయ్యాయని పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కమిషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలోని వివిధ పోలీ స్టేషన్‌లో నమోదుతో అండర్ విచారణ, కోర్టు విచారణలో ఉన్న ఐపీసీ కేసులు 536 పరిష్కారం లభించిందని పేర్కొన్నారు. అలాగే విపత్తు నిర్వహణ కేసులు 1,432, పెట్టి కేసులు 56, ఈ పెట్టి కేసులు 8,568, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 2,456 చొప్పున పరిష్కరించినట్లు వివరించారు. సైబర్ నేరాలకు సంబంధించి కమిషనరేట్ పరిధిలో 78 కేసుల్లో బాధితులకు రిఫండ్ మొత్తం రూ.13,08,684, సీసీపీఎస్, పోలీస్‌స్టేషన్ రామగుండంలో నమోదున రెండు కేసుల్లో బాధితులకు తిరిగి రూ. 4,57,610 రిఫండ్ చేసినట్లు తెలిపారు. సైబర్ నేరాలకు సంబంధించి బాధితులకు రూ. 17,66,294 అందజేసినట్లు సీపీ పేర్కొన్నారు. కోర్టు సిబ్బంది 15 రోజులుగా కక్షిదారులను స్వయంగా కలిసి లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాలకు సత్వర న్యాయం జరుగుతుందనిఅవగాహన కల్పించడంతో టార్గెట్‌కు మించి కేసులు పరిష్కారమైనట్లు వివరించారు.

# రక్తదాతకు సన్మానం

కాల్వశ్రీరాంపూర్, జూన్ 15: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా మండలంలోని తారుపల్లి హైస్కూల్ లో ఆంగ్ల ఉపాధ్యాయునిగా పని చేస్తున్న కూరపాటి సత్యప్రకాశ్‌రావును హన్మకొండలో ఆదివారం సన్మానించినట్లు తెలిపారు. హన్మకొండలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎక్కువసార్లు రక్తదానం చేసిన వ్యక్తులకు సన్మానించారు. ఈసందర్భంగా సత్యప్రకాశ్‌రావును శాలువాతో సత్కరించి సర్టిఫికెట్ అందించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ పెసరు విజయ్ చందర్ రెడ్డి, కేయూ రిజిస్ట్రార్ రాంచంద్రం, పాలకవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాస్‌రావు, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, వేణుగోపాల్, పెద్ది వెంకట్ నారాయణగౌడ్, హరిప్రసాద్, తదితరులు ఉన్నారు.


బాధితుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

# బాధిత కుటుంబాలకు పరామర్శ

ముత్తారం/కమాన్‌పూర్ , జూన్ 15: ముత్తారం మండల కేంద్రానికి చెందిన కట్ల రవీందర్ రెడ్డి, బేద సంపత్ ఇటీవల రోడ్డు ప్రమాదం లో గాయపడగా మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆదివారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అడవిశ్రీరాంపూర్ మాజీ సర్పంచ్ దుబాసి దేవేంద్ర, శ్రీనివాస్ తల్లి మల్లేశవ్వ మరణించగా ఆమె పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కమాన్‌పూర్ మండలం సుభాష్ నగర్‌కు చెందిన డోనికెనా సదానందం, పేరపల్లి గ్రామానికి చెందిన ఎరుకల గట్టమ్మ, గుమ్మడి నర్సయ్య ఇటీవలే మరణించగాచ బాధిత కుటుంబాలను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్ రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ అత్తే చంద్రమౌళి, మాజీ వైస్ ఎంపీపీ సుధాడి రవీందర్ రావు, సింగిల్ విండో డైరెక్టర్ పోతుపెద్ది రమణారెడ్డి, నాయకులు అలువోజు రవీందర్, భూపెల్లి మొగిళి, చల్ల సమ్మయ్య, మల్యాల రాజయ్య, నాంసాని సమ్మయ్య, అమ్ము కుమార్ పాల్గొన్నారు.

## మల్లన్న ఆలయంలో మంత్రి పూజలు

ఓదెల, జూన్ 15: ఓదెల మల్లికార్జునస్వామి ఆలయాన్ని రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి జీ వివేక్ వెంకటస్వామి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది, అర్చకులు మంత్రికి స్వాగతం పలికారు. ఆలయ ఈవో సదయ్య మంత్రికి స్వామి వారి ప్రతిమ అందజేశారు. ఆలయ అభివృద్ధికి ఎంపీ నిధులతో పాటు తాను కృషి చేస్తానని మంత్రి తెలిపారు. ఆయన వెంట అల్లం సతీశ్, నాయకులు ఉన్నారు.

## బాధిత కుటంబానికి 'వీహెచ్‌ఆర్' భరోసా


నగదు అందజేస్తున్న వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులు

కోల్‌సిటీ, జూన్ 15: విధి వైపరీత్యంతో తండ్రిని కోల్పోయిన చిన్నారులకు వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ భరోసా కల్పించింది. నగరంలోని 42వ డివిజన్ తిరుమల్ నగర్‌కు చెందిన తాడూరి శ్రీనివాస్‌గౌడ్ అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ పెద్ద మరణంతో ఆ పిల్లలు దిక్కులేనివారయ్యారు. ఆ చిన్నారుల దీన స్థితిని చూసి డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వ్యాళ్ల హరీష్ రెడ్డి దృష్టికి తీసుకవెళ్లారు. స్పందించిన ఆయన ఆ పిల్లలకు మంచి భవిష్యత్ అందించడానికి తమ ఫౌండేషన్ బాధ్యత తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. హరీశ్ రెడ్డి సూచనలతో ఫౌండేషన్ రామగుండం టీం ఇన్‌ఛార్జి సిగిరి రాము ఆదివారం ఆ చిన్నారుల ఇంటికి వెళ్లి తక్షణ సాయంగా రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తిరుమల్, ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకులు కరుణాకర్, బొట్ల పోషం, యాదగిరి, బాలరాజు, సురేశ్, రవి పాల్గొన్నారు. కాగా, వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ సేవలను బస్తీ ప్రజలు అభినందించారు.

## కాంట్రాక్ట్ కార్మికులను ఇబ్బందులకు గురిచేయొద్దు

జ్యోతినగర్, జూన్ 15: ఎన్టీపీసీ యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులను క్యారెక్టర్ సరిఫికెట్ పేరుతో మానసిక ఇబ్బందులకు గురి చేయొద్దని ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధుల నుంచి క్యారెక్టర్(పీవీసీ) సర్టిఫికెట్ తీసుకురావాలని, లేకపోతే 14రోజులకు గేట్ పాస్ జారీ చేస్తామని కార్మికుల మనోధైర్యాన్ని కోల్పోయేలా పేర్కొనడాన్ని మానుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఆరు నెలల వరకు ఉన్న గేట్‌పాస్‌ను 4రోజులకు కుదించడం సరికాదని పేర్కొన్నారు. గత ఒప్పందం ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా కార్మికులకు ఆరు నెలల వరకు గేట్ పాస్‌లు జారీ చేయాలని డిమాండ్ చేశారు. గత ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. ఇక్కడ జేఏసీ నాయకులు నాంసాని శంకర్, చిలుక శంకర్, భూమల్ల చందర్, భూమయ్య, రాజమల్లయ్య, లక్ష్మణ్, సత్యం, శ్రీనివాస్ ఉన్నారు.

## విద్యార్థులకు పురస్కారాలు

గోదావరిఖని, జూన్ 15: ఇటీవల జరిగిన పదోతరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థి లలిత (531), నవ్య(508) మార్కులు సాధించగాచ ఆదివారం స్థానిక మేదర్‌బస్తీ రోడ్‌లోని ప్రాఫిట్ షూ కంపెనీ ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేశారు. మాజీ కార్పొరేటర్ మహంకాళి స్వామి, కోదండ రామాలయ చైర్మన్ గట్ల రమేశ్ విద్యార్థులను సన్మానించారు. జ్ఞాపికలు, బ్యాగు, పుస్తకాలు, షూ అందజేశారు. నాయకులు పూసాల శ్రీనివాస్, ప్రాఫిట్ షూ మేనేజర్ సంతోష్, సిబ్బంది ఉన్నారు.

## రామగుండం అభివృద్ధికి సహకరిస్తా

గోదావరిఖని, జూన్ 15: రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి పూర్థిసాయిలో సహకారం అందించనున్నట్లు తెలంగాణ ఎస్సీ ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల వృద్ధుల సంక్షేమ ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. మంత్రిగా తొలిసారి ఆదివారం గోదావరిఖనికి వచ్చిన ఆయన స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మౌలిక వసతుల కల్పన, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషిచేస్తున్నామని తెలిపారు. స్థానిక నాయకుల అండ, ప్రజల సహకారం ద్వారా ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యమన్నాని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రిని కాంగ్రెస్ నాయకులు సన్మానించారు.

## తహసీల్ భవన నిర్మాణానికి భూమిపూజ

పాలకుర్తి, జూన్15: పాలకుర్తి తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌రాజ్‌ఠాకూర్ ఆదివారం భూమిపూజ చేశారు. అన్ని ప్రభుత్వకార్యాలయాలు కలిపి ఇంటిగ్రేటెడ్ భవనం నిర్మాణం చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ అప్పలనాయుడు, తహసీల్దార్ జే సునీత, మక్కాన్‌సింగ్ సేవాసమితి అధ్యక్షురాలు మనాలీఠాకూర్, ప్యాక్స్ చైర్మన్ బయ్యపుమనోహర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గడ్డం తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

## నేటి నుంచి రైతు భరోసా నగదు జమ

పెద్దపల్లి, జూన్15: వానకాలం–2025 సీజన్‌కు సంబం ధించి ఎకరాకు రూ. 6వేల చొప్పున రైతు ఖాతాల్లో జమ చేసే కార్యక్రమం, రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను సోమవారం సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్‌గా ప్రారంభిస్తారని డీఏవో దోమ ఆదిరెడ్డి ఆదివారం ఒక ప్రకటలో తెలిపారు. జిల్లాలో 54 రైతువేదికలుండగా, ఇప్పటి వరకు 14 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్సింగ్ యూనిట్లు ఉన్నాయి. సోమవారం 24 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను సీఎం వర్చువల్‌గా ప్రారంభిస్తారని తెలిపారు. ప్రారంభోత్సవానికి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు, కలెక్టర్ కోయ శ్రీ హర్ష సుల్తానాబాద్ మండలం కనుకుల రైతు వేదిక నుంచి హాజరవుతారని పేర్కొన్నారు.

**రైతు భరోసాపై స్పష్టత కరువు**

2024– 25 యాసంగి సీజన్‌లో మిగిలిన ఉన్న రైతులకు రైతు భరోసా ఇస్తారా? ఇవ్వరా? అనే విషయంపై స్పష్టత కరువైంది. సాగు చేసిన భూములకు రైతు భరోసా పథకం కింద సీజన్‌కు రూ. 6వేల చొప్పున రెండు సీజన్లకు కలిపి రూ. 12వేలు అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. కానీ 2024 –25 యాసంగి సీజన్‌లో కేవలం 3ఎకరాల లోపు ఉన్న రైతులకు మాత్రమే రైతు భరోసా నగదు జమ చేశారు. మిగిలిన రైతులకు ఇప్పటి వరకు కూడా జమ కాలేదు. 2025 వానకాలం సీజన్‌తో పాటు 2024– 25 యాసంగి సీజన్‌లో మిగిలిన ఉన్న రైతులకు రైతు భరోసా డబ్బులు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## సర్టిఫికెట్లు అందజేత

రామగిరి, జూన్ 15ః మండలంలోని కల్వచర్ల గ్రామంలో తిమ్మరాజు వంశీ మోహన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ సాంకేతిక శిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకొన్న మొదటి బ్యాచ్‌కు చెందిన 25 మంది విద్యార్థులకు ఆదివారం సర్టిఫికెట్లను అందజేశారు. ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం స్థాపించిన వంశీమోహన్–నిఖిలను పలువురు అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, మేకల మారుతి, సంతోష్, నరహరి, వికాస్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED


jobs Apply Now!

★Wanted Female Accountants, Qul: B.Com(Accounts), Exp: 2 Yrs in Tally Software, Job Location Karimnagar, Salary: 12K-15K per Month, Negotiable, Interested candidates can send resume: 8977919477 (Whatsup), email: anilcholleti.ca@gmail.com.
NTK-350007

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189


రఘువీర్ సింగ్‌ను సన్మానిస్తున్న నాయకులు

# రఘువీర్ సింగ్‌కు సన్మానం

జూలపల్లి, జూన్ 15 ః జూలపల్లిలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్‌ను బీఆర్ఎస్ కార్యకర్తలు ఆదివారం ఘనంగా సన్మానించారు. రఘువీర్‌సింగ్ ఇటీవల బీఆర్ఎస్ రజతోత్సవ సభ, తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు అమెరికా వెళ్లి స్వదేశానికి తిరిగి వచ్చారు. ఈ క్రమంలో కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పెద్దాపూర్‌లో గంగమ్మ తల్లి ఆలయంలో దేవతామూర్తులను దర్శించుకున్నారు. గంగపుత్రుల సంఘం నాయకులు సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పార్టీ మాజీ మండలాధ్యక్షుడు కొండపెల్లి కృష్ణమూర్తి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు సంకెండ్ల లక్ష్మణ్, నాయకులు పొలగాని సతీశ్, తొగరు శ్రీనివాస్, పూరెల్లి గంగయ్య, నాడెం శ్రీధర్, బండి రాజయ్య, మెండె మల్లేశం, కల్లెపెల్లి అంజయ్య, మెండె తిరుపతి పాల్గొన్నారు.

# సింగరేణి పాఠశాల ప్రవేశ పరీక్షల ఫలితాల వెల్లడి

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 15 : సింగరేణి యాజమాన్యం ఆర్జీ–2 ఏరియా సెక్టార్–3 పాఠశాలలో 2025–26లో సీబీఎస్ఈ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టింది. దీంతో పాఠశాలలో చేర్పించేందుకు సింగరేణి ఉద్యోగులు, సింగరేణేతర ఉద్యోగులు తమ పిల్లలను పాఠశాలలో చేర్పించడానికి ఆసక్తి చూపారు. దీంతో అత్యధికంగా నర్సరీ నుంచి తొమ్మిదో తరగతి వరకు దాదాపు 1600 దరఖాస్తులు వచ్చాయి. యాజమాన్యం ఊహించిన దానికంటే అత్యధిక దరఖాస్తులు రావడంతో అడ్మిషన్ ఇవ్వడం తలనొప్పిగా మారింది. దీని నుంచి బయటపడడానికి దరఖాస్తులు తీసుకున్న వారందరికీ ప్రవేశ పరీక్షలు నిర్వహించి మెరిట్ ప్రతిపాదికన అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది. పరీక్షలు నిర్వహించి ఫలితాలు వెల్లడించే క్రమంలో వివిధ కార్మిక సంఘాలు కార్మికుల పిల్లలకు 80శాతం ఇవ్వాలని, కార్మికేతర పిల్లలకు 20శాతం ఇవ్వాలని డిమాండ్ చేశాయి. అటు కార్మికులు, కార్మిక సంఘాల నుంచి ఒత్తిడి పెరగడంతో గత మూడురోజులుగా ఫలితాలు వెల్లడించకుండా యాజమాన్యం కాలాయాపన చేసింది. గత విద్యా సంవత్సరంలో అత్యధికంగా కార్మికేతర పిల్లలే పాఠశాలలో ఉండడంతో వారిని తొలగించడం జఠిలంగా మారింది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని నూతనంగా పాఠశాలలో కేవలం ఉద్యోగుల పిల్లలకే అడ్మిషన్ ఇవ్వాలని యాజమాన్యం నిర్ణయించి హుటాహుటిన శనివారం రాత్రి పాఠశాలలో ప్రవేశ పరీక్షలు ఫలితాలు వెల్లడించారు. అడ్మిషన్ దొరకని పిల్లలతోపాటు కార్మికేతర పిల్లలు నిరాశ చెందారు. సెక్టార్–3 పాఠశాలలో యాజమాన్యం పైలట్ ప్రాజెక్టు కింద సీబీఎస్ఈ విద్యా విధానం అమలు చేయడంపై హర్షం వ్యక్తమవుతున్నా విధి విధానాలు ముందుగా ప్రకటించి ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తే బాగుండేదని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

**సింగరేణితేర పిల్లలకు నిరాశే**

**సింగరేణి పిల్లలకే ప్రాధాన్యం**

యాజమాన్యం సింగరేణి వ్యాప్తంగా వున్న పాఠశాలలో సీబీఎస్ఈ విద్యా బోధన అందించాలని నిర్ణయించింది. దీనికి మొదటగా పైలట్ ప్రాజెక్టు కింద సుమారు రూ. రెండు కోట్ల వ్యయంతో సింగరేణి సెక్టార్–3 పాఠశాలలో ప్రవేశపెట్టేందుకు అనుమతించింది. ఊహించని విధంగా స్పందన వచ్చింది. పై అధికారులతో చర్చించి పాత విద్యార్థులను తొలగించకుండా అవసరమైన మేరకే సింగరేణి ఉద్యోగుల పిల్లలకే మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పించాం. దశలవారీగా పాఠశాలలో మరింత మంది విద్యార్థులకు చదువుకునే అవకాశం ఇచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామని తెలిపారు.

–సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్

# ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించాలి


పోస్టర్లు పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

**వామపక్ష పార్టీల నాయకుల డిమాండ్**

గోదావరిఖని, జూన్ 15: ఆపరేషన్ కగార్ పేరిట కొనసాగుతున్న హత్యాకాండను వెంటనే నిలిపివేసి కాల్పుల విరమణను ప్రకటించాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం కాల్పుల విరమణతో పాటు మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించ ధర్నా వాల్‌పోస్టర్‌ను ఆదివారం స్థానిక చౌరస్తాలో విడుదల చేసి వారు మాట్లాడారు. మావోయిస్టులను అణిచివేసే కుట్రతో ప్రారంభించిన ఆపరేషన్ కగార్ యుద్ధంతో ఆదివాసులతో పాటు మావోయిస్టు పార్టీ నాయకులను కార్యకర్తలను బూటకపు ఎన్‌కౌంటర్ల పేరిట హత్యలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు మృతిచెందిన 540మందిలో మూడోవంతు పైగా ఆదివాసులే ఉన్నట్లు తెలిపారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, మావోయిస్టులతో చర్చలు జరపాలని తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఇక్కడ వామపక్ష పార్టీల నాయకులు ఐ కృష్ణ, శనగరం చంద్రశేఖర్, జూపాక శ్రీనివాస్, ఈ నరేశ్, జీ సత్యనారాయణరెడ్డి, తోకల రమేశ్, రామకృష్ణ, రాజేశం, బతుకుల రాజన్న, వైకుంఠం, రాయమల్లు తదితరులు ఉన్నారు.

# వైద్యశిబిరం

ఫర్టిలైజర్‌సిటీ, జూన్ 15: స్థానిక ఈశ్వర కృప వృద్ధాశ్రమంలో ముస్త్యాల హోమియో కేర్‌కు చెందిన డాక్టర్ సాహితీ ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు చేసి మందు లు పంపిణీ అందజేశారు. ఇక్కడ ఆశ్రమం డైరెక్టర్లు గంట సత్తయ్య, సత్యనారాయణ, పుల్లూరి సత్త య్య ఉన్నారు. స్థానిక చైతన్యపురికాలనీలో చైతన్యపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రోహిణి ఫౌండేషన్, ఎన్టీపీసీ సహకారంతో వైద్యశిబిరం నిర్వహించారు. కాలనీకి చెందిన 200 మందికి పైగా వైద్యులు స్క్రీనింగ్ పరీక్షలు చేసి మందులను అందజేశారు.

# నీటి ట్యాంకర్‌ను శుభ్రపరిచిన మున్సిపల్ సిబ్బంది

జ్యోతినగర్/కోల్‌సిటీ, జూన్ 42: వందరోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నగర పరిధిలోని మంచినీటి ఉపరితల జలాశయం(వాటర్ ట్యాంకును) మున్సిపల్ సిబ్బంది శుభ్రపరిచారు. ట్యాంకు ఆవరణలోని పరిసరాలను కూడ శుభ్రం చేశారు. మిగిలిన మంచినీటి ట్యాంకర్లను కూడా శుభ్రపరుస్తామని డీఈఈ జమీల్ పేర్కొన్నారు. ఇక్కడ వార్డు అధికారులు, మెప్మా సిబ్బంది ఉన్నారు.

## పగుళ్ల రోడ్లు.. పైలం మరి



**జూలపల్లి మండల కేంద్రంలో అంతర్గత రహదారులు అధ్వానంగా మారుతున్నాయి. కనీసం మరమ్మతులు చేపట్టకపోవడం శాపంగా మారుతున్నది. చాలా ఏండ్ల కిందట నిర్మించిన సిమెంట్ రోడ్లు ప్రస్తుతం పగుళ్లు పడి, కంకర తేలి, గుంతలు పడి ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యాన్ని వెక్కిరిస్తున్నాయి. వాహనదారులు వాటిని తప్పించుకుంటూ వాహనాలు నడుపుతూ అవస్థలు పడుతున్నారు. ఏండ్ల తరబడి 1,3,8,12,14 వార్డుల్లో సీసీ రోడ్లు దెబ్బతిన్న ఎవరూ పట్టించుకోవడం లేదంటూ స్థానికులు మండిపడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కొత్త రోడ్లు నిర్మించాలని కోరుతున్నారు.** – జూలపల్లి, జూన్15